క్లుప్తంగా

బ్రహ్మంగారి నాటక ప్రదర్శన

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో సోమవారం విరాట్ పోతులూరి వీరబ్రహ్మం గారి జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఆంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 4 వరకు ఉంటుందని భజన మండలి సభ్యులు తెలిపారు. కళాకారులు తమ పాత్రలో చక్కటి ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి తరలివచ్చారు.

చలివేంద్రం ఏర్పాటు

మాగనూర్: వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొల్పూర్ గ్రామస్తులు అన్నారు. సోమవారం గ్రామ ప్రధాన కూడలిలోని పంచాయతీ దగ్గర చలివేంద్ర కేంద్రాన్ని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరసింహ, బాలప్ప, తాయప్ప, బంగి రాకేష్, గణేష్, రాము, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల



మక్తల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 27న పూలే అంబేద్కర్ జాతర సందర్భంగా సోమవారం పట్టణంలో కరపత్రం నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రెం అంజి ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమానికి మేధావులు, సంఘాలు తరలిరావాలని కోరారు.

రోడ్డుపైనే మట్టి

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో గల ఇటుక బట్టీ నిర్వాహకులు రోడ్డుపైనే మట్టి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మొక్కలను కూడా వదలకుండా వాటిపై బట్టీలకు అవసరమయ్యే మట్టి, పొట్టును వేశారు. అధికారులు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థులకు ఎప్‌సెట్ కోచింగ్



మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్ శివారులో గల కస్తూర్బాగాంధీ విద్యార్థినులకు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సోమవారం ఎప్‌సెట్ కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ముఖ్యంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో అత్యుత్తమ బోధన నిర్వహిస్తున్నామని, వినియోగించుకుని మంచి ర్యాంకులు సాధించి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యాబోధన కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్లు పద్మ నళిని, శుభలక్ష్మి, సూర్య చైతన్య, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎస్‌ఓలు శంకరమ్మ, మాధవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లను ఆపాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జవాబుదారీ లేని ఎన్ కౌంటర్లను వెంటనే ఆపాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సామ్రాజ్యవాదులకు ఏజెంట్లు గా ఉన్న అంబానీ, అదానీలాంటి వారికి దేశ పాలకులు దాసోహం అయ్యారని ఆరోపించారు. పెట్టుబడిదారులు, భూస్వామ్యవర్గాల మెప్పు కోసం ఎన్‌కౌంటర్లు చేయడం తగదన్నారు.

రంజాన్ మాసంలో ఖురాన్ పఠించాలి



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇదే మాసంలో దివ్యఖురాన్ అవతరించిందని ప్రముఖ ప్రసంగీకులు సయ్యద్ అబ్దుల్‌అహద్‌సొహేల్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాలలో రంజాన్ మాసం ప్రాముఖ్యత వివరిస్తు ముస్లీమేతర వైద్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ధార్మిక సదస్సు నిర్వహించారు. రంజాన్ మాసంలో అధికశాతంలో దాన, ధర్మాలు చేయాలని, నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆహార పదార్థాలతో పాటు దుస్తులను పంచి పెట్టాలని సూచించారు. తమ వద్దనున్న సంపదలో 25 శాతం జకాత్ రూపంలో పేదలకు పంచిపెట్టాలని, తరావి నమాజులో ఖురాన్ పఠనం జరుగుతుందని రంజాన్ మాసంలో దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముజీబుర్‌రెహ్మాన్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, జమాతేహింద్ జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్, వైద్యులు మణివర్ధన్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, సందీప్‌రెడ్డి, జీహెచ్ఎం బాలరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, అగ్రీప, రాఘవేందర్, న్యాయవాది అశోక్‌గౌడ్, వాహేద్, అమీర్, అక్రఫ్, హనీఫ్, స్థానికులు పాల్గొన్నారు.

తరగతి గదులు కరువు

- బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం కూల్చివేత
- వరండాల్లో కొనసాగుతున్న చదువులు
- నిలిచిన మనఊరు–మనబడి పనులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



ఊట్కూర్‌లో వరండాలో కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

ఊట్కూర్: గత ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడం వల్ల మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు ఆగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలకు రూ.1.20కోట్ల నిధులు మంజూరై, టెండర్లు పూర్తి చేశారు. అధికారులు భూమి పూజ చేశారు. పాత భవనం రేకుల పైకప్పు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో కురుస్తుండేది. కొత్త భవనం పనులు చేపట్టాలనే ఉద్దేశంతో భవనాన్ని కూల్చి వేశారు. ప్రభుత్వం మారడంతో భవన పనులను కాంట్రాక్టర్ ప్రారంభించలేదు. దీంతో సరిపడ తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ఉపాధ్యాయులు వరాండాల్లో చదువులను కొనసాగిస్తున్నారు. గతంలో పాత భవనంలో 6, 7 తరగతులను నిర్వహించేవారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

320 మంది విద్యార్థులు

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, ఉర్దు మీడియం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతుంది. తెలుగు మీడియంలో 215, ఉర్దు మీడియంలో 105 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, ఉర్దు మీడియం 6, 7 తరగతుల విద్యార్థులకు గదులు లేకపోవడంతో వరాండాల్లో చదువులు కొనసాగిస్తున్నారు. ఉర్దు మీడియం 6వ, 7వ తరగతి విద్యార్థులకు కూర్చోడానికి బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చొని చదువుకుంటున్నారు.

నేలపై కూర్చుంటున్నాం



తరగతి గదులు లేకపోవడంతో వరండాలో చదువుకుంటున్నాం. కూర్చొడానికి బెంచీలు లేక నేలపైన కూర్చొని చదువుకుంటున్నాం. పక్కనే మధ్యాహ్న భోజనం కోసం వంట చేస్తుండంతో పొగతో ఇబ్బందులు పడుతున్నాం.

– అబ్దుల్ రకీబ్, 6వ తరగతి

చదువుకోలేక పోతున్నాం..



చిన్న సందులో తరగతిని కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు ఏకాగ్రతతో వినలేకపోతున్నాం. పాఠ్యాంశాలకు సంబంధించి గోడలకు చార్టులు లేవు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నరేందర్, 7వ తరగతి

ఉత్తర్వులు రాగానే పనులు

పాఠశాలకు రూ.1.20కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి చేశాం. ప్రభుత్వం మారడం వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు వస్తే పాఠశాల భవన పనులు చేపడుతాం.

– రాంచంద్రర్, ఈఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, మహబూబ్‌నగర్

పంచాంగం ఆవిష్కరణ



పంచాగం ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

కోస్గి: సమ్మత ధృగ్గణిత క్రోధి నామ సంవత్సర పంచాగాన్ని సోమవారం పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగాణంలోని ఇంద్రనీలేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచగాన్ని జంగమ సమాజం ప్రతినిధులు ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు హంపయ్యస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, చండీహవనం జరిపారు. బ్రహ్మశ్రీ శశిభూషణ సిద్ధాంతి గణించబడిన పంచగాన్ని భారత ప్రభుత్వం సమ్మతిస్తుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, అధ్యక్షుడు హంపయ్య, శివశ్రీ, మహేష్, మల్లికార్జున్, వినయ్ స్వామి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే గుర్తింపు



సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: సమాజంలో పనిచేసే వారికి గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని గుడిగండ్లలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న కృష్ణయ్య ఉద్యోగవిరమణ పొందుతున్న సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో ఎల్లప్ప, పర్వత్‌రెడ్డి, భీంరెడ్డి, సదానందన్‌గౌడ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్యం చేరుకునేందుకు కృషి చేయాలి



రాజేశ్వరిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నారాయణపేట రూరల్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకుంటే తప్పకుండా విజయం సాధించవచ్చని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్‌నాగరాజు అన్నారు. మండలంలోని శ్యాసన్‌పల్లి చెందిన కోట జయశ్రీ, కృష్ణయ్య దంపతుల కుమార్తె రాజేశ్వరి ఇటీవల జరిగిన గురుకుల పరీక్షలో టీజీటీ ఇంగ్లీష్, సోషల్‌లో రెండు పోస్టులకు అర్హత సాధించింది. ఈ మేరకు ఆ సంఘం తరఫున సోమవారం శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో హన్మంతు, లక్ష్మీకాంత్, మోహన్, నారాయణ, నరేష్, గణప శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



పిల్లిగుండ్లతండాలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు

నారాయణపేట రూరల్: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ వ్యవసాయశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. మండలంలోని పిల్లిగుండ్లతండా పరిధిలో అన్నదాతలు వివిధ రకాల పంటలు వేయగా నీరు లేక పంట ఎండిపోయిందని వివరించారు. సోమవారం క్షేత్రస్థాయిలో ఏఈఓ అనిల్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప పంటలు పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు తుల్జామ్మ, బాలునాయక్, చంద్రశేఖర్, రాజు, హరిసింగ్, విఠల్, సునీల్ పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాజాతా

నర్వ: వేసవికాలంలో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు అన్నారు. సోమవారం సాయంత్రం లక్కర్‌దొడ్డిలో సురక్ష పోలీస్ కళాజాతా సభ్యులు ఆట, పాటల ద్వారా చట్టాలపై, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎక్కడో ఒక చోట చోరీలు అవుతున్నాయని, ప్రతి గ్రామంలో ప్రజలు కలిసికట్టుగా ఉండి నివారణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో యువత మత్తుపదార్థాలకు బానిసై ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్, సతీష్, మాజీ సర్పంచ్ శివన్న పాల్గొన్నారు.

నాసిరకంగా పోలీస్‌స్టేషన్ ప్రహరీ నిర్మాణం



పోలీస్‌స్టేషన్ పాత ప్రహరీపై నిర్మిస్తున్న గోడ

ధన్వాడ: మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రహరీగోడ నాసిరకంగా నిర్మిస్తున్నారు. కొత్త భవనం చుట్టూ ఉన్న పాత ప్లాస్టర్ తొలగించి, ఇటుక గోడపై సిమెంట్ పెల్లెలతో నిర్మిస్తున్నారు. ఇది నారాయణపేట–హైదరాబాద్ వెళ్లే ప్రధాన కూడలి వైపే ఉన్నా, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా నిర్మిస్తే గోడ మొత్తం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. పాతగోడను పూర్తిగా తొలగించి కొత్త గోడను నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కోయిల్‌కొండ: వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు తలెత్తకుండా మండలాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా గ్రామాలలోని సమస్యలను సభ దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వైస్‌ఎంపీపీ పారుపల్లికృష్ణయ్య, ఎంపీడీఓ కాళప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు ఇంటింటి సర్వే



దేవరకద్రలో పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా అధికారి జరీనాబేగం

దేవరకద్ర: జిల్లాలో కుష్టు నిర్మూలించడానికి ఇంటింటి సర్వే చేశామని జిల్లా అధికారి జరీనా బేగం తెలిపారు. సోమవారం దేవరకద్ర పీహెచ్‌సీలో గుర్తించిన అనుమానితులకు పరీక్షలు చేశారు. కుష్టు రహిత సమాజం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 1,91,860 ఇళ్లను వైద్య సిబ్బంది, ఆశలు 858 మంది, సూపర్ వైజర్లు 168 మంది బృందాలుగా సందర్శించినట్లు వివరించారు. 9, 03,413 మందిని పరీక్షించినట్లు వివరించారు. ఇందులో 2,730 మందిని అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో అనుమానితులకు తగిన వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 6 మందిని రోగులుగా గుర్తించామని ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 49 మంది వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ వ్యాధి నయం అయిన వారు 48 మంది ఉన్నారని వివరించారు.

దేవరకద్రలో

పీహెచ్‌సీ పరిధిలో 6,176 ఇళ్లను సందర్శించి 31,248 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో108 మంది అనుమానితులుగా గుర్తించామని తెలిపారు. సోమవారం వారందరికి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించిన తరువాత అందులో ఎవరికీ వ్యాధి లేదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పీఎంఓ హన్మంతరావు, శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ సంఘం షెడ్ పనులు ఆపేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బైట్ అల్ ఖైర్ ఫౌండేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్లాక్‌టవర్ సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న హమాలీ సంఘం షెడ్ పనులను వెంటనే ఆపేయాలని బైట్ అల్ ఖైర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ తఖీయుద్దీన్, కార్యదర్శి వాసెఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లక్రితం ఇదే ప్రాంతంలో ఇందిరాగాంధీ పార్కు ఉండేదన్నారు. ఆ తర్వాత అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దానిని తొలగించి గడియారంచౌరస్తా చుట్టుపక్కల విశాలంగా రోడ్డును నలువైపులా వెడల్పు చేశారన్నారు. సమీపంలోనే తాళాలు బాగుచేసేవారు, వీధి వ్యాపారులు పండ్ల తోపుడు బండ్లు, చెప్పుల అమ్మకాలు కొనసాగిస్తున్నారన్నారు. అయితే రెండు రోజుల క్రితం అక్కడ హమాలీల అడ్డా కోసం పక్కాగా పిల్లర్లతో షెడ్ పనులు ఆరంభించారన్నారు. దీనివల్ల చుట్టుపక్కల వారికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రస్తుతం ఎంపీ ఎన్నికల నియమావళి అమలులో ఉండగా ఎలా నిర్మాణం చేపడతారన్నారు. ఘటన స్థలానికి మున్సిపల్ సిబ్బందిని పంపి ఆపివేయించినా అర గంటలోపే పునః ప్రారంభించారని వారు ఆరోపించారు. కమిషనర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన వెంటనే తమ సిబ్బందిని పంపి పనులు ఆపివేయించామన్నారు. పునఃప్రారంభించి ఉంటే మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు



బోనాలతో మహిళల ఊరేగింపు

నవాబుపేట: మండల పరిధిలోని దయాపంతులపల్లి గ్రామంలో కొనసాగుతున్న బొడ్రాయి, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ముగిసినట్లు నిర్వాహకులు చెన్నయ్య, రఘు, గోవర్ధన్, ప్రభాకర్, తిరుపతయ్య తెలిపారు. కాగా చివరి రోజు సోమవారం గ్రామం మొత్తం బోనాల ఊరేగింపు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠకు రూ. 2లక్షలు సాయం..



దయపంతులపల్లిలలో పూజలు చేస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: ఆధ్యాత్మికత గ్రామాల అభివృద్ధికి మూలమని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం దయాపంతులపల్లిలో నిర్వహించిన బొడ్రాయి, నవగ్రహ, శివాలయ దేవత విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తన వంతుగా రూ. 2 లక్షలు సాయం ప్రకటించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, చెన్నయ్య, కృష్ణగౌడ్, మైసమ్మ చైర్మన్ కృష్ణయ్య, ప్రతాప్, గోపాల్‌గౌడ్, తిర్పతయ్య, రఘు, గోవర్ధన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీజ్

ఆత్మకూర్: అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో తెలుగు వేణు హోటల్‌లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. రూ.మూడు వేలు విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు రంగోలి పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి బయో ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగోలీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు నందిని, సౌమ్య, మనీష, అర్చన, అరుణ బహుమతులు అందుకొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అమీనా ముంతాజ్, శ్రీపాద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితిజిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్‌చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలోఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు నాగరాజు, సతీష యాదేశ్, మైబు, మడేలయ్య,నగేష్ బాలకృష్ణ, నర్సిములు, చంద్ర య్య, చందు, రాజేష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నామని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం రాత్రి కొత్తకోట వై జంక్షన్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో 40 బైకులకు, ఐదు కార్లకు, ఐదు ఆటోలకు జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. నగదు తరలింపు చేపట్టేవారు సరైన ఆధారాలు చూపెట్టకుంటే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ బీచుపల్లి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మరికల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మరికల్: మండల కేంద్రంలోని పాత సింగిల్‌విండో కార్యాలయం వద్ద సోమవారం సీఈఓ వెంకట్రాములు, వ్యవసాయశాఖ అధికారి పరశురాం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రేడ్–ఏ రకానికి రూ.2,203, గ్రేడ్–బీకి రూ.2,183 ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, సుజాత, గోపాల్, వీరన్న, సూర్యమోహన్, రామకృష్ణ, కృష్ణయ్య, హరీష్, రాజు, రామకృష్ణారెడ్డి, శ్రీను, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

మాగనూర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సింగిల్‌విండో సీఈఓ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ర్డేసీఎస్ కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. తేమశాతం 17గా నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో ఆడిటర్ వీరభద్రయ్య, సిబ్బంది అంజనేయులు, వెంకటేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. కనీస మద్దతు ధర కోసం రైతులు తేమ 17శాతం, తాలు ధాన్యపు గింజు ఒక శాతం, పక్వానికి రాని కుచించుకపోయిన వంకర తిరిగిన గింజలు 3 శాతం, దెబ్బతిన్న రంగు మారిన మొలకెత్తిన పురుగు తొలచిన గింజలు 3శాతం తీయబడునని వ్యవసాయ అధికారితో ఆధార్ జిరాక్స్, పట్టా పాస్ బుక్, బ్యాంక్ ఖాతా, ఏఈఓ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సీఈఓ వెంకట్రాములు తెలిపారు.

ఊట్కూరు: మండలంలోని తిప్రరాస్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యదర్శి హుస్సేన్ సిబ్బంది షాకీర్‌పాషా, మహేష్, విద్యాసాగర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తహసీల్దార్ దయాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం హిందుపూర్, ముురహర్‌దొడ్డి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఏపీఎం బస్వరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధన్వాడలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, రైతులు



హిందుపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దయాకర్‌రెడ్డి